రయితుబిడ్డ

నరహరిశెట్టి వేంకటరత్నముగారు

పశ్చిమగోదావరిజిల్లాలోనిపూళ్ల: మధ్యాహ్నము రెండుగంటలవేళ: అధిఆషాఢమాసము. పల్లెటూరు. ఆమె గట్టుపైనున్న గున్నమామిడిచెట్టుక్రింద పసికూనను మెత్తనిగుడ్డలుపై పరుండబెట్టి అనటకూరుచుండి యున్నది. ఆమె ప్రక్కనే పదునైదేండ్లకుమారుడు ఆసీనుడైయున్నాడు. పదిఅడుగులదూరములో నొకతాటియాకులయిల్లు దానిప్రక్కనే గోడలేమియు లేక మొకరములపైననే యున్నపాక. సమీపముననే కంచెవేసియున్న గడ్డివాముదొడ్డికలదు. ఆమెకు ఎడమచేతివైపు చిన్నిచెరువు. దానిగట్టుపైన అంటుమామిడిమొక్కలు, రెండు మూడు అరటిచెట్లు, నాలుగైదు కొబ్బరిమొక్కలు, సంగీతపుచెట్టు, మల్లెతీగలు, తెల్లగన్నేరుచెట్లు, గుబురుగానున్న వేపచెట్లు, తాటిచెట్లు కలవు. గట్టుక్రిందనున్న పొలములో కొందరు స్త్రీలు వరుసగా నిలుచుండి మెత్తని తడినేలపై లేతవరియాకు ఊడ్చుచున్నారు వంచిననడుములు ఎత్తకుండగనే. ఆమె, ఆమెకుమారుడు గొంతెత్తి సన్నని మధురస్వరమున ఇట్లుపాడుచున్నారు:

ఈ గడ్డిపూవులే
ఈ దారిపొంతనే
అలసిపో నీవోయి
దేవా, దేవా!
నీ యిష్టమైన చో
నీ పూలదండలో
మెరసిపో నీవోయి
దేవా, దేవా!

—'శ్రావణి'నుండి.

తడినేలలో చెమటగార్చుచు పనిచేయుచున్న ఆ స్త్రీలు ఈ యిర్వురుపాడిన పదమును మరల ఆలపించుచుండిరి. వీరుపాడిన పాదమునే యొకసారి మరియొకసారి దాని తరువాతిపాదమును నవ్వుచు, నడుమ నడుమ నొకరినొకరు వేళాకోళముచేసికొనుచు, ఉత్సాహముతో, ఉద్విగ్నహృదయములతో నా ఊడ్పుకత్తెలు పాడుచున్నారు. ఈ పాటవలన కలిగే ఆనందములో వారు పనిచేయుచున్నమాట, పనివల్లకలిగే బాధ మరిచిపోయినారు. నిమిషనిమిషమునకు ఇనుమడించుచున్న ఉద్వేగము, ఉత్సాహము వారికి మైమఱపు కలిగించినది. 'ఆకట్టయిల్లాయియ్యవో అమ్మా!' అనీ, 'ఆకు రొంతలేతగావుందే మేలిమితీగెలాగు' అనీ, 'ఆయమ్మకి యేం వోపికే మనకీపాట నేర్పడానికి' అనీ, 'అల్లాటి కంఠం నాకేవుండేనా' అనీ మధ్యమధ్య వారిలో గుసగుసలు మాత్రము బయలుదేరుచున్నవి.

ఇంతలో తొమ్మిదేండ్లబాలుడు మణుగుబూరి పరపరనములుచు పరుగునవచ్చి 'అమ్మా! మన రవుడీ యెవరో మనిషిమీద భోంయిభోంయిమని మొరుగుతోంది' అన్నాడు.

ఆమె 'దాన్నియిల్లా తీసుకరాకపోయావా మరెందుకూరుకున్నావు?' అన్నది.

బాలుడు 'ఎంతపిలిచినా రాలేదమ్మా. గబగబా వెళ్లి గబాలున మెడపట్టుకొని బతిమాలాను కూడా రమ్మని. నేనురానుపో నీకెందుకూ అంటూవుందమ్మా!' అన్నాడు.

మల్లా అందుకొని 'ఏయిరవుడీ! జాగ్రత్త, నీ పని పట్టిస్తా, పో, యింట్లోకిపో, అంటే భోంయి మనివచ్చి భోంయి నీ మణుగు బూరెతినేస్తా జాగ్రత్త, అని మీదపడబోలే వచ్చేశావమ్మా' అని గంతులు వేయుచు, నవ్వుచు మణుగుబూరి నములుచునే పసిబిడ్డపరుగెత్తి

నీ పూలదండలో
మెరసిపో నీవయ్యా
దేవా, దేవా!

అని సన్నగా మెల్లగా తనలోతానే పాడుకొనుచు అచటనే కూరుచుండిపోయినాడు.

తల్లి అజ్ఞానువర్తియై పెద్దకుమారుడు రాడీని తీసుకవచ్చుటకై పరుగున వెళ్లినాడు. అయ్యది భయంకర మూర్తి అయినను చనవుతో బాలుడు దాని పట్టా పట్టుకొని అచటనున్నవానిని వెంటబెట్టుకొని తల్లిదగ్గరకు వచ్చినాడు.

అతడెవరో క్రొత్తవాడు. నవనాగరకుడు. మల్లెపూవువంటి తెల్లనివస్త్రములు; కండ్లకు బంగారు కలోచనములు; చేత నొకచక్కని చేకర్ర.

ఆమె లేచి నిలువబడి యింకను కుక్కను పట్టుకొనియేయున్న పుత్రునిజూచి వారిని తీసుకువెళ్లి యింటిలో కుర్చీ వేసి కూర్చోబెట్టిరా అన్నది.

ఆ నూతనపురుషుడు మారుమాటాడకనే బాలునివెంట వెళ్లి యింట నాసీనుడైనాడు.

రవుడీని కట్టివేసి వచ్చినపుత్రునితో 'తండ్రీ! వానితరువాత పాదములుకూడా వాళ్లకునేర్పుతూవుండు; నే నిప్పుడేవస్తాను' అని పసిపాపదగ్గరనున్న కుర్రవానిని తీసుకొని, అదివరకు జారుముడివేసియున్న కేశములు విడదీసి మరలముడివేసి పయ్యెదసర్దుకొని ఆమె బయలుదేరినది.

చిన్నిబాలుడు: 'అమ్మా! ఈ మణుగుబూరి యేంచెయ్యనూ?' అన్నాడు.

తల్లి: 'అక్కడ పెట్టిరా. మళ్లీవచ్చేక తిందువుగాని' అన్నది.

ఆమె ముప్పదియేండ్ల లావణ్యవతి. చూపులకిరువదియేండ్ల యౌవనవతివలె కాన్పించును. చామన చాయ. పలుచని, బలిష్ఠమైన నునుపైనశరీరము. వదనమున సౌమ్యమైన తేజస్సు. వేషమున పల్లెటూరిపడుచువలె నుండినను ప్రకాశమైన మోము, వెన్నెలవెలుగుగలనేత్రములు, మృదుమధురమైన వాక్కు, మందగమనము యివన్నియు నామె సామాన్యరమణి కాదనియు, నామెలో అపూర్వమైన, అనిర్వాచ్యమైనశక్తి, తేజస్సు యేదో కలదని అపరిచితులకు తోచును.

మెల్లగా నామె చిన్నిబాలునితోవచ్చి 'అయ్యా! దాహమేమైనపుచ్చుకుంటారా?' అని అడిగినది.

అతడు అవనతవదనుడయియే ఏమోఆలోచించుచునే 'కొంచె మిప్పించండి' అన్నాడు.

ఆమె లోనికిజని శుభ్రమైన కంచుపాత్రనిండా చిక్కని గేదెమజ్జిగపోసి అతనికి స్వయముగానే యిచ్చినది. 'నీ పేరేమిటి?' అని అదివరకే ప్రశ్నింపబడియుండుటచే నా బాలుడు 'ఊఁ—నాపేరా—మర బాలచంద్రుడు' అనుచున్నాడు.

313

ఆతడు చిఱునగవుతో 'ఏ వూరి బాలచంద్రుడువయ్యా నీవు! చుక్కల్లో చంద్రుడు నీకేమవుతాడు.' అన్నాడు.

బాలుడు: 'నేనా పల్నాటిబాలచంద్రుణ్ణిఅండీ. చుక్కలు, చందమామ, కొంగలు, ఎద్దులు, మారవుడీ కుక్క అన్నీ మాచుట్టాలేనండీ, మా అమ్మ చెప్పింది' అన్నాడు.

అంతలో కంచుపాత్రతీసుకవచ్చిన తల్లి ఆ పలుకులు విని పాత్రనందించిన తర్వాత బాలునెత్తుకొని 'ఎవరు నేర్పినారయ్యా! ఈ చిట్టి బుద్ధులు? నువ్వు పల్నాటిబాలచంద్రుడవా?' అన్నది చిఱునగవుతో.

'అవు నమ్మా! నాన్నగారు నామీద పద్యాలు నేర్పారుకూడాను. ఆ పల్నాటిచంద్రుడే నువ్వు. బ్రహ్మనాయుడు నేను, ఐతమాంబ మీాయమ్మ అన్నారు కూడాను నాన్నగారు'.

ఆమె ఆ ముద్దుపలుకులు విని వికసించిన హృదయముతో తేజోవంతములైన కళ్ళతో నవ్వుచు బాలుని శిరస్సు మూర్కొని 'అయ్యా! తమరేమి పనిమీద వచ్చినారో? మగవారు యింటిదగ్గరలేరు. ఇప్పుడే గంట క్రిందట అకుమళ్ళ చెరువుకేసి వెళ్లినారు. తమరు కూర్చుంటే ఒక అరగంట, గంటలో వారు వస్తారు. మీారు మాట్లాడివెళ్లవచ్చు' అన్నది.

అతడు: 'వారితో నాకేమియు ప్రత్యేకపు పనిలేదండి. వీలైతే దర్శనముచేసి వెళతాను. కేవలము అందుకనే కాదు నేనురావడము. రోడ్డుప్రక్కనే వొంటరిగావున్న యిల్లు, మీారిందాక యేదో పాడుతున్నారు, చాలా శ్రావ్యముగావుంది, విని చూచి పోదామని వచ్చాను. ఇంతలో దాహముకూడా అయింది.'

ఆమె: 'మాపాటలేమున్నవి లెండి! ఏవో పల్లెటూరిపదాలు. పనివాళ్లకు నేర్పితే వాళ్లుకూడా నేర్చుకొని ఆనందించుతారు కదా అని తీసుపోక నేర్పుతున్నామే కాని—'

అతడు: 'అమ్మా! అల్లా అనకండి. పల్లెపుడోళ్లలో మీాసంగతి అనుకుంటూవుంటే విన్నట్టుజ్ఞాపకము. మీా భర్తగారు చాలావిద్యావంతులనీ, మీాకుకూడా ఇంగ్లీషు, సంస్కృతము బాగా చదువుకున్నవారనీ అక్కడివారు చెప్పుకుంటూవుంటే విన్నా. అయినా ఆపాట పల్లెటూరిపాట యెల్లాఅవుతుందిలెండి, మీావంటి వారు పాడుతూవుంటే.'

ఆమె: 'ఏమండీ! అల్లా అంటారు మేము పల్లెటూరివాళ్లము కామా? మాతండ్రిగారు రైతు, భర్తగారు రైతు, చిన్నప్పటినుంచిపెరిగింది కేవలము పల్లెటూళ్లలో. కాస్తచదువుకున్నంతమాత్రాన బస్తీవాళ్లమై పోతామూ?'

అతడు: 'దానికేమిలెండి. ఇందాక అబ్బాయి పద్యాలేవో నాన్నగారు నేర్పారన్నాడు ఏమైనా చదవమనండి. చిన్నపిల్లలు చదువంటే నాకు అమితమైనకోరిక.'

తల్లి: 'ఏది నాయనా! బాలచంద్రుడుపద్యాలు చదువు మీానాన్నగారు నేర్పినవి. వారు వింటారట' అని బాలుని క్రిందదింపినది.

బాలచంద్రుడు తీవిగానిలువబడి చేతులుముడుచుకొని:

"ఈ విశాలప్రపంచాన నింతదనుక
నెందరోపుట్టి గతియించిరేమిఫలము?
వీరులగువార లేనాటివారలైన
శాశ్వతులువారె కీర్తిరాజ్యమున నెపుడు.
శత్రువులగుండె లవియ దేశంబుకొఱకు
ఘోరముగబోరి పల్నాటివీరుడైన

బాలచంద్రుండు తన తొలిప్రాయమందె
స్వర్గమున కేగి యెన్నేండ్లొ జరిగిపోయె.
నాటి పల్నాటివీరు డొనర్చినట్టి
వేడి నెత్తుటి మడుగు లానాడె యింకె;
అతనిచే కూలినట్టి యోధాళితనువు
లవనిగర్భంబుతో నాడె యైక్యమయ్యె.
పాడువడె నాటి పల్నాటిపౌరుషంబు;
చెరగె నావీరు విక్రమచిహ్నలెల్ల;
గాని యీనాటికిని గూడ వానియశము
పులకరింపజేయు నాంధ్రులయొడళ్ల.
వీరుడగు బాలచంద్రుని విక్రమంబు
నేడు నానాడుజూచి పవిత్రమైన
నాగులే రిప్పుడును పలనాటియందు
నా యమృతశౌర్యగీతము లాలపించు.
వీరుడగు బాలకుం డుద్భవించినట్టి
వెలమకులమెల్ల విఖ్యాతి వెలయుచుండె.
అతని పదధూళిచే ధన్యమైన యట్టి
వీరమేడపి లోకైకవిదితమయ్యె.
అతని తలిదండ్రులై యెంతొ యశముగనిరి
బ్రహ్మనాయుడు, నైతమాంబయు ధరిత్రి;
ఖిలముగా కెప్పటికిని వీరులసమాధి
శౌర్యసుమముల ధర్మవాసనల జిమ్ము."

—'గీతామంజరి' నుండి.

మధురమైన కంచువంటి కంఠమున పాడినాడు.

అతడు: 'శభాష్! తెలివిగలపిల్లవాడవోయి. మీాకు పేరుప్రతిష్ఠలు తెస్తాడు. అందులో సందేహము లేదు. ఏదైనా బడిలోకి పంపిస్తే క్రమమైనపద్ధతిగా విద్యనేర్చుకోవడానికి, రేపు ఏ బి. యే; ఎం. యే. ప్యాసవడానికి వీలుంటుందిగా, అల్లాచేయకపోయారూ?'

ఆమె: 'ఏమోలెండి. వీళ్లనిల్లా బ్రతుకనిస్తురూ! వాళ్లతండ్రిగారు-యిదివరకు ఆయన కాలేజీలో ప్రొఫెసరుగా పనిచేశేవున్నారు-యిప్పుడు మాపిల్లలకే ప్రొఫెసరైనారు. ఏదో పదిపుట్లనేల పండించుకుంటూ యీా

315

పొలముగట్లమీద వున్నవాళ్లనుకూడా పంచమశాలుల్లను పెంచామనీ, మేముపంచములమనీ వూరువారంతా బహిష్కరించేరు. ఇదీ వొకందుకు మంచిదే అనుకున్నాము. ఇక ఈ పిల్లవాణ్ణి బడిలో అడుగుపెట్టనిస్తారూ, ఆ మొనగాళ్లు?'

అతడు: 'ఓహో! అల్లాగటండీ? అయితేనేమిలెండి, ఏపిల్లవాడివల్ల మీరుచిక్కులు పడతారో, ఆపిల్లవాడి మూలంగానే మీరు శాశ్వతకీర్తిపొందుతారు. బాగావృద్ధిలోనికి వస్తాడు తప్పకుండా.'

ఆమె: 'కీర్తియెందుకులెండి. ఈ కుర్రవాడితోనే అఘాందనులకు బుద్ధి కరిపించవలె నని మా మగవారి అభిప్రాయము. అందుచేతనే ఆయన స్వయముగా ప్రత్యేకశ్రద్ధతో ఈ పిల్లవాడికి విద్య చెప్పుతూవుంటారు. ఇద్దరిపిల్లల సూక్ష్మబుద్ధి, చురుకుదనము చూచి వాళ్లనాన్నగారు పట్టరాని సంతోషములో ఇబ్సను నాటకములో చెప్పినట్లు Then you shall drive all the wolves out of the country, my boys! అంటూవుంటారు. అందరము నవ్వుకుంటాము.'

అతడు: 'అంతకంటే యేమికావాలండి మీకు? నిక్షేపమువంటిసంతానము; కోట్లధనముకంటే విలువైన విద్యాసంపత్తి. అయితే తోడేళ్లుఅంటున్నారు. ఎటువంటితోడేళ్లో నాకర్థముకాలేదు.'

ఆమె: (కెచ్చుకొనిన ఉద్రేకముతో) 'సంఘము: కొయ్యబారిన సంఘం. క్రూరమైనసంఘం. దట్టముగా ఒకప్రక్క అడివిపెరిగిపోయి అందులో తోడేళ్లు, యెలుగుబంట్లు స్థిరనివాసము యేర్పరుచుకుంటే కళ్లుమూసుకొని కొయ్యబొమ్మలవలె వూరుకున్నారు. ఇప్పటికే అవి చాలామట్టుకు నాశనముచేసినవి. ఇల్లాగే కళ్లుమూసుకుని పశువులాగా వూరుకుంటే ఈ పశువులనన్నింటినీ అవి తినివేస్తవి. ఇప్పుడా కారడవిని కొట్టివేసి ఆ క్రూరజంతువుల్ని—కొన్నిటిని నాశనముచేసి—కొన్నిటిని సముద్రములోనికి తరిమివేసి ఈవగలిగితే యీదుతవి లేకపోతే చస్తవి—మరలా దేశమంతా సస్యశ్యామలము చేయవలె.' అని తన వీరావేశముగాంచి తానే నవ్వుకొనినది.

బాలుడు: 'అమ్మా! అడివి నేనుకూడా కొట్టివేస్తా. మొన్న నాన్నగారు బ్రహ్మజెవుడుతుప్ప కొట్టివేస్తూవుంటే నేనుకూడా కొడవలిపట్టుకొని పరపర నరికివేశా. యేఁఅమ్మా! నేనుకూడా నీతోరానా అడివి నరకడానికి?'

తల్లి: 'వస్తువుగానిలే నాయినా! నేను వెళ్ళేటప్పుడు—'(గంభీరవదనముతో) 'అయ్యా! దేశమంతా మూర్ఖులు. నూటికి తొంబదితొమ్మండుగురు పరమపశువులు. ఎవ్వడైనా ఒక్కవ్యక్తి మానవుడుంటే అతడు నిద్రపోతూవుంటాడు. ఈ తొంబదితొమ్మండుగురే సంఘాన్ని, దేశాన్ని నడుపుచున్నారు. ఆ వొక్కడు తెలిశవుండికూడా పశువులలో చేరిపోతాడు. ఇదంతా మార్పుకావడానికి కొంతకాలము పడుతుంది—అయ్యా! లేకపోతే చూడండి. ఈ పసిబాలుణ్ణి చేరదీశామని ఈ మూర్ఖులకింత పట్టుఎందుకూ? అందరిలోనూ వెలిగే వెలుగు వొక్కటేఅని ఆ మూర్ఖులకు తెలియచెప్పితే మాత్రము తలకెక్కుతుందీ? సూర్యునికి కిరణములెల్లాగో మనముకూడా పరమేశ్వరుడి కల్లాగుఅని మా మగవారు అనేకవిధాల ఆ మూర్ఖులకు చెప్పిచూశారు. పశువులకు మనుష్యులమాటలేమి అర్థమవుతవి, పోనీ మీరేచెప్పండి?'

అతడు: "అవునండి. ప్రపంచము. ఎదురుచెప్పితే కష్టాలున్నమాట నిజమే. ఏమిచేస్తాము?"

ఆమె: 'ఏమండీ! మీరుకూడా అల్లాగేఅంటారు. చూస్తూచూస్తూ విషము త్రాగమంటే యెల్లాగండీ? అల్లాగైతే కుక్కలకు, కాకులకు, మనుష్యులకు తేడాయేమున్నదీ? కొన్నివిషయాలలో ఈ మూర్ఖులకంటే కుక్కలు, కాకులు నయము మనిపిస్తవి.—అయినా యిప్పు డేమనుకొంటే ప్రయోజన మేమున్నదిలెండి! నేనేరీతిగా

చేయవలెనుగాని. రేపు ఈ కుర్రవాడే వాళ్లకళ్లు తెరిస్తే అప్పుడు మేలుకుంటారు.' తల్లి ఉద్రిక్తురాలై మాట్లాడుటగని అంతవఱకు పరాయత్తచిత్తుడైయున్న బాలుడు ఆమె చెంగుపట్టికొని 'అమ్మా! ఆయనతో ఎందుకే అంతకోపముగా మాటలాడుతున్నావు? రవుడీని తీసుకరానా యేమిటి? అదే వెళ్లమనిచెపుతుంది. మనము చెప్పడమెందుకు?' అన్నాడు.

వా రిద్దరు నవ్వుచు:

అతడు: 'గడుసువాడవోయి, చంద్రా!'

ఆమె నవ్వుచు 'ఆయన వాళ్లవూరు పెద్దపట్టణం తీసుకువెళ్లి పెంచుకుంటారట వెళతావూ?'

బాలుడు: 'ఊఁహుఁ, నాకేం వెళ్లేదాకా. ఇక్కడైతే నాన్నగారిదగ్గర చదువుతుంటా, కోతికొమ్మచ్చి ఆడుకుంటా, నాపెంపుడు పొదకోడి నేమిచేయమంటావు? మరిదానితో ఎవరు పరిగెత్తుతారు—అమ్మా! నేవెళ్లితే పాప నెవరాడిస్తారు?'

తల్లి: 'రవుడీ ఆడిస్తుందిలే. లేకపోతే చందమామవస్తే అది ఆడిస్తుంది.'

బాలుడు: 'నేనూ చంద్రుడినేగా, నాకే యివ్వరాదూ? నేను తీసుకెళ్లి చిలకలకిస్తే అవి జాంకాయిలు పండువి పెడతయి. ఏంచక్కగా తిని మళ్లా నాదగ్గరకొస్తాడు. మనతెల్లావు పాలిచ్చి పెంచి దానిదూడ, నేనూ, పాపాయి గంతులేస్తూ దాగుడుమూచి ఆడుకుంటాము.'

తల్లి: 'ఆటలో తల్లి యెవరుంటారు మరిమీకు?'

బాలుడు: 'మనసంగీతపుచెట్టుచిటారికొమ్మల్లో గూడుపెట్టిన కాకిపిల్లలతల్లి మాఆటలో తల్లి. అవన్నీ నీ కెందుకేమిటి? నీవు మాజత లే నన్నావుగా, నన్ను ఆయనతో వెళ్లిపొమ్మన్నావుగా.'

తల్లి: 'లేదయ్యా! అల్లా అనలేదు. నిన్ను నేను విడిచిపెడతానా ఆయన యివ్వమంటే మాత్రము. మనమందరమూ రేపు ప్రొద్దున్న దాగుడుమూచి ఆడుకుందాములే.' అతనివైపుతిరిగి 'అయ్యా! మీరు పాట విందామని వచ్చినట్లు కనిపిస్తుంది. అక్కడికి వెళుదాము రండి. పల్లెటూరిపాట ఎల్లావుందో చెపుదురుగాని.'

మువ్వురు బయటికి వచ్చినారు.

కోకిలరాగము. పెద్దకుమారుడు కళాయుక్తముగా మధురమందముగా, ఆగి ఆగి వీచుచున్న మెను గాలి కెగయు జలతరంగములవలె నడుమ నడుమ కంఠము విసరుచు ఉత్సాహోద్వేగములతో, ఉన్మీల నేత్రములతో లేతఅరటిపువ్వులవంటి చేతులు ఊపుచు ఈరీతి పాడుచున్నాడు:

'ఈ చిన్ని సెల యేళ్ల
నీ కొండ కోననే
ఎండిపోనీవోయి
దేవా! దేవా!
నీ యిష్టమైనచో
నీ ప్రేమరాశిలో
నిండిపోనీవోయి
దేవా! దేవా!

ఊడ్పుకత్తెలుకూడా అంత ఉత్సాహోద్వేగముతోనే మధ్య మధ్య బదులికచే గొంతు నొక్కి నొక్కి ప్రతిపదము ప్రతిధ్వనించుచున్నారు.

చిన్నబాలుడు పరుగున వెళ్లి పసిపాప ప్రక్కలో దాచివచ్చిన మణుగుబూరి పట్టుకొని: 'అమ్మా?'—అని ప్రశ్నాప్రకాశితమైన కనులతో నే అడిగి అనుమతిపొంది పరపర నమలుట మొదలు పెట్టినాడు.

ఆమె: 'అయ్యా! యిటుదయచేయండి' అని పసిపాపదగ్గర కాతని తీసికొని వెళ్లి అచట కూరుచుండ జేసి తానుకూడా రెండుబారలదూరములో పసిపాప ప్రక్కలో కూరుచుండి 'అయ్యా! మాకేమున్నది? రైతులకు భూదేవితల్లి పసివేళల పచ్చగావుంటే చూడడమే పండుగ. పచ్చని పొలము బంగారురంగుగా మారిందాఅంటే సంక్రాంతిపండుగ వస్తుంది; యిక అప్పుడు పాటకజనమేమిటి, పక్కా రయితుబిడ్డ లేమిటి ఒళ్లు మరిచి పండుగ జరుపుకుంటారు. కొందరు కోడిపందాలు, కొందరు పొలిమేరమ్మకు పోటుపోతులు, వచ్చే కూతుళ్లు, అల్లుళ్లు—యిదే రైతులకు పదివేలు. ఇకమేమైతే ఆసంక్రాంతి పదిరోజులు మామగవారి పెత్తనము క్రింద ప్రార్థనలు—పొలము బాగాపండించి వర్షములు సమృద్ధిగా కురిపించి తనసంతానాన్ని ప్రేమదృష్టితో ఆశీర్వదించినందుకు అపరమపితకు నమస్కారము--చేస్తాము. మాపనులుచూచి వాళ్ళు మేము పిచ్చివాళ్ల మంటారు. వాళ్ల క్రూరమైన నీచమైన కోడిపందాలు, అమ్మవారికి కల్లు పోరబోయిడము యిటువంటివి చూచి మేము చీకాకుపడతాము. ఏమున్నదండీ? మరీ ఈకాలవక్రింద వూళ్లలో తృణకాష్ఠజలసమృద్ధిగా వుండడము, ఈ పశువులను సరియైన త్రోవలో నడిచే పశువులకాపరి లేక పోవడమువల్ల కన్నుమిన్ను గానకుండా వున్నారు. ఏమైనా ఎంతచెడినా బస్తీవాళ్లకంటే చాలా మడుగులు మీళ్లు నయిచేలెండి. ఇప్పుడు కాక పోతే వొకప్పటికైనా మోక్షమున్నదని ఆశవొకటైనా వుంది.'

అతడేమో ఆలోచించుచు వినుచున్నవానివలె నంతదనుక కూరుచుండి 'అయితే యేమమ్మా! కరమా పొలా లేవీ అంత పచ్చగా వున్నట్టు కనిపించవు; ఈచుట్టుప్రక్కల అప్పుడే వూడ్చివేసినట్లు కనిపిస్తుంది. యేమి కారణము?' అన్నాడు.

ఆమె: 'చెప్పడము లేదండి. పొలము చక్కగా దుక్కిదున్ని జాగ్రత్తగా వొడ్లువంచి దమ్ము చేసి ముదురుగా వూడిస్తే భూమా పాడుకాదు. పంటా బాగాపండుతుంది. ఈ చుట్టూ పచ్చగా కనిపించేదంతా మనదే. దీన్ని దేవుడుచెర్వుపొలమంటాము; ఇది అరవయియొకరాల ఖండ్రిక. అందరికన్నా ముందుగా ముదురుగా వూడ్చవలెఅని మామగవారి పట్టు. ఈ యేడు అల్లాగే చేశాము. నిరుడు ఈకనిపించే అరుమడులూ చెఱుకు వేయడమువల్ల కొంచెము చెల్లాచెదురైనయి. ముందు యీమడులు బాగుచేసి మరీ తర్వాత తక్కిన మడులు దమ్ముచేశాము. అదృష్టవశాత్తు నిరుడు చెఱుకుపంట సమృద్ధిగా పండింది: పదిరాళ్లు చేతులోమోగినయి. ఆపై సంవత్సరము— అయినాకాన్యపుమూలగా యీతచెట్లువున్న గట్టు చూశారూ, అక్కడ సామర్లకోటఫారమునుంచి తెప్పించి క్రొత్తరకము అరటిచెట్లు వేశాము. ఓపికతో శ్రద్ధతో చెమటవూడ్చి యిద్దరమూకూడ అందులో పనిచేశాము. కన్నుచెదిరేటట్లుగా కంపెనీ చక్రకేళీగెలలు కాచినవి. ఇల్లాగే శ్రద్ధగా పనిచేసుకుంటే ఫలము దక్కుతుంది. మావూరి వాళ్లకు భూదేవిమాటే మరుపుకు వచ్చి మత్తెక్కి రెండురాళ్లు చేతులో వేసుకొని బస్తీమీదపడి నానాపాడు అవుతున్నారని చెప్పలేదటండి. పొలమంటే హాయిగా మెల్లగా పనిచేసుకుంటే యెంతోదయతో అది ఫలితము చేకూరుస్తుంది. ఈకాస్త పని కూడా మా రైతు పోకిల్లాలకు భారమై పోతూంది. కోతలైన తర్వాత దంటుతెంపు పెట్టే పొలాలకు దంటుతెంపుపెట్టవలె, మోక వేసిన ఒడ్డుమళ్ళు మరమ్మతు చేయవలె, గొర్రెల పెంటకట్టేదానికదీ, పాటి మట్టి పోయివలసినదానికదీ, మోకపల్లాలు బాగుచేసుకోవడము, ఆకుమళ్లు చెరువు మోక వేస్తే మళ్ళీ త్రవ్వించడము, చిదికిపోయినగట్లు మరలాపోసుకోవడము—ఒకటేమి టండీ వేయున్నారు పనులున్నవి భూదేవికి

చేస్తే. గట్టిదైన జమవు, కంది వేస్తే పండుతుంది. పొలము గొడ్లుతొక్కి పాడుచేయకుండా కనిపెట్టి జాగ్రత్తచేసుకుంటే భూమి పాడవదు. ఇవన్నీ చిన్న విషయాలే. అందుచేతనే మరీయెక్కువ శ్రద్ధతో గమనించవలె. మామగవారు జాగ్రత్తగా యివన్నీ చూచుకుంటారు. నాకూ పిల్లలకూ చదువు చెపుతారు. కోఆపరేటివు యూనియన్ పనిచూచుకుంటారు. ఇప్పుడు బిల్డింగు సొసయిటీ వొకటి పెట్టవలె అని ఈ నడుమనే ఇంగ్లండుకువ్రాసి నేషనల్ బిల్డింగు సొసయిటీవారి దగ్గర్నుంచి యావత్తు భోగట్టా తెప్పించేరు. ఏదో యీ విధముగా క్రిందపడుతూ, మీదపడుతూ కాలము వెళ్లబుచ్చుతున్నాము.'

అతడు: 'అబ్బా! యెన్నివిషయాలు క్రొత్తవి తెలిసినవండీ యీరోజున. మీవంటి స్త్రీలుపదిమందివుంటే దేశము బాగుపడదటండీ?'

ఆమె: 'నాశక్తియేమున్నదండీ. ఆయన అన్నిశ్రద్ధతో నాకుబోధచేస్తూ వుంటారు. అవన్నీ మనసుకు పట్టించుకుంటాను. చేయగలిగినంతా సాయపడుతూ ఉంటాను.'

అతడు: 'అయితే యేమమ్మా! ఎంతతృప్తి, ఎంత ఆనందము ఈ పనుల్లో ఉన్నప్పటికీ యీనడిదీవిలో మానవపురుగు సంబంధము లేకుండా వుంటే లోకముతో సంబంధము తెగిపోయినట్లూ, వొంటరితనముగాను బెంగగాను ఉండదూ? మీరేమో, మీపొలాలేమో అయితే ప్రపంచమెల్లా నడుస్తూందో ఏమేమి రోజు రోజుకి క్రొత్తవిశేషాలు జరుగుతూన్నవో తెలియకపోతే నడిసముద్రము మధ్యదీవిలో వున్నట్టు కష్టముగానూ, లోటుగాను అనిపించదూ?'

ఆమె: 'ప్రపంచపు సంగతులు తెలియకేమండీ? తెలుగులో ఆంధ్ర, కృష్ణా, ధర్మసాధనీ పత్రికలు; ఇంగ్లీషులో బొంబాయి టైమ్సువార పత్రిక, హిందూ వారపత్రిక, మాడరన్ రివ్యూ వస్తవి. ఇవి నన్ను, పిల్లలను, పనివాళ్లనుయెదట కూర్చోబెట్టుకొని ఆయన చదివి వినిపిస్తూ వుంటారు. ఇంకా విదేశాలనుంచికూడా పత్రికలు వస్తవిలెండి'.

అతడు: 'ఓఅల్లాగటండీ. అయితే కేవలము స్వర్గలోకమండీ మీది. ఏమేమి పత్రికలు వస్తవండీ, విదేశాలనుంచి.'

ఆమె: 'అమెరికానుంచి లిటరరీ డైజస్టు, ఫిజికల్ కల్చరు, ఎగ్రికల్చరిస్టు, ట్రూస్టోరీ; ఇంగ్లాండు దేశము నుంచి మాంచెస్టరుగార్డియను, అవుట్‌లైను, టిట్‌బిట్సు, టవున్ అండు కంట్రీహోమ్సు, ఆర్గొసి పత్రికలు ఆదివారమునాడు ఫారిన్ మెయిలు రోజున వస్తూవుంటవి. ఏవో యివీ అవీ చదువుకుంటూ, కబుర్లుచెప్పుకుంటూ, మధ్య మధ్య పొలముపని చూచుకుంటూ—అన్నట్టు మరిచిపోయినాను పూలతోట చూపిస్తాను రండి' అన్నది.

ఆమెవెంట నాతడు, బాలచంద్రుడు బయలుదేరినారు. రెండు అడుగులు వేసిన తర్వాత బాలచంద్రుడు పట్టుకొనిన తల్లిచీరకుచ్చెలు వదలి రెండుగంతులువేసి ప్రత్యేకమేర్పరుపబడిన గూటిలోనున్న పొదకోడిని పట్టుకొనివచ్చి తల్లి కెదురుగావెళ్లి ఆమెనాపుచేసి కోడిరెక్కల విడదీసిపట్టుకొని 'అమ్మా! నాకుకూడా యిటువంటి రెక్కలే వుంటే నా చెట్లు ఎక్కకుండానే నేరేడిపళ్ళూ, తాటిపళ్ళూ, కొబ్బరిబోండాలూ కోసుకొచ్చి ఒక్కగంతులో నీకివ్వకపోయాను—అమ్మా! యింకా యేమిచేస్తానో తెలుసా? ఎప్పుడు

బెంగపుట్టితే అప్పుడే నాన్నగారిదగ్గిరికెళ్లి అకుమళ్ల చెరువులో వాల్తాను.' ఆమె చెరగుపట్టుకొని లాగుచు ఆమె కనులవంక చూచుచునె అన్నాడు.

అతడు: 'పోనీ నీపాదకోడి నెక్కి ఎగిరి రారాదూ మావూరికి త్రోవ చెపుతాను.'

బాల: 'అల్లాయెక్కి యెగరడమే చేతవస్తే నా మీవూరువచ్చేదాకా నాకేమిపని; యీపాటికే లాహోరు వెళ్లి లజపతిరాయుని'

తల్లి: 'బాలా—'

బాల: 'లేదండి, పోనీలెండి, ఆనాజున లజపతిరాయి చచ్చిపోయాడని తెలియంగానే మాయమ్మ, మానాన్నగారు ఏడ్చారండీ. నేనుకూడా యేడ్చానండీ! పాపం,—'

తల్లి నవ్వుచు సంభాషణమార్చే యుద్దేశముతో 'నాయనా! పాదకోడి నెక్కి చందమామదగ్గిరికి వెళ్లరాదూ, నీకు పెద్దన్నయ్య అవుతాడుగా అతను' అన్నది.

బాల: 'అవునమ్మా! నిన్న చందమామ మేఘాలతో పరిగెత్తలేక వెనుకపడిపోతే మనమంతాచూచి నవ్వలేదూ! ఏమి పిచ్చిఅన్నయ్యా! యింతే నానీపస అని చెప్పిపద్దామనుకున్నాకూడాను—అమ్మా! అటు చూడు కొండమీద నల్లమబ్బులు ఎల్లా పరుగెత్తుతున్నయో. వాటితోటి సమానంగా భూమిమీద నేనూ పరిగెత్తగలను.'

నూతనుడు, ఆమెకూడా ఒకేసారి ఆకసము వంకజూచి:

ఆమె: 'ఎంతలో మబ్బులు క్రమ్మేసినయి'

అతడు: 'అవునండీ, ఈమాటల సందడిలో మనము చూడనేలేదు' అన్నాడు.

బాలచంద్రుడు గంతులు వేయుచు 'అమ్మా! చినుకులుపడుతున్నయ్యే'అని

'వానాలు కురవాలి
వరిచేలు పండాలి
మాగరిసె నిండాలి
బుడుగో, బుడుగో!
మాదాసి దంపాలి
మాయమ్మ వండాలి
మాబొజ్జ నిండాలి
బుడుగో, బుడుగో!

అనుచు పరుగెత్తి పోయినాడు.

చటాలున వెనుకకుతిరిగివచ్చి బాలచంద్రుడు: 'అమ్మా! వానకురిస్తే నేలంతా తడుస్తావుంది; కొండ తడవలేదేమే?' అన్నాడు.

తల్లి: 'కొండతడవదు నాయనా! అక్కడ సూర్యుడుండి తడవకుండా కాపాడుతాడు.'

—మిగిలియున్నది.